## క్లుప్తంగా

### తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



**ఆత్మకూర్:** వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ రాజు, ఏఓ వినయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణ, రుక్మేందర్‌రెడ్డి, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టే విధంగా ముందుకెళ్లాలని సూచించారు.

### గడ్డివాము దగ్ధం



**కొత్తకోట రూరల్:** పట్టణ కేంద్రానికి చెందిన సాయిరెడ్డి తన పశువుల కోసం మూడు ట్రాక్టర్ల పశుగ్రాసం (గడ్డి)ని కొనుగోలు చేసుకుని పొలం వద్ద నిల్వ చేశాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టారు. గురువారం ఉదయం సమీప పొలాల వారు సాయిరెడ్డికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి చూసే సరికి గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. ఎండల తీవ్రత ఎక్కువ ఉండటంతో పాటు ఈ ఏడాది పంటలు తక్కువగా ఉండడంతో పశుగ్రాసం తీవ్రత ఏర్పడిందని వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సాయిరెడ్డి కోరుతున్నాడు. గడ్డివాము దగ్ధమైన తీరును స్థానిక కాంగ్రెస్ నాయకులు హరీష్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సహాయం అందేవిధంగా కృషి చేస్తానని బాధిత రైతుకు హామీచ్చాడు.

### ఆర్థికసాయం అందజేత



**పెబ్బేరు రూరల్:** మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ఈరపాగ కరుణాకర్ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం పంపించారు. స్థానిక బీఆర్ పార్టీ నాయకులు వనం రాములు, రాజశేఖర్, కురుమూర్తి, గోల్డ్ బాలస్వామి, గోవిందునాయుడు స్థానిక నాయకులతో కలిసి గురువారం మృ దేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందించారు.

### విరాళం అందజేత



**కొత్తకోట రూరల్:** మండలంలోని రాయిణిపేటలో నూతనంగా నిర్మిస్తున్న ధ్యాన కేంద్రం కోసం వనపర్తి జిల్లా పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు రాధాక్రిష్ణారెడ్డి తన వంతు సాయంగా రూ.9,116 విరాళంగా నిర్వాహకులకు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తే నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు వీలుంటుందని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో ధ్యాన పిరమిడ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మి, సుందర్‌రెడ్డి, పాండురంగయ్య, దయాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### కుక్కల దాడిలో జింక మృతి



**పాన్‌గల్:** వ్యవసాయ పొలంలో మేత కోసం వచ్చిన జింకపై కుక్కలు దాడి చేసి చంపి వేసిన ఘటన గురువారం పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, ఫారెస్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బహదూర్‌గూడెం గ్రామానికి చెందిన మన్యం పాన్‌గల్ సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో గురువారం ఉదయం మేత కోసం వచ్చిన జింకను కుక్కలు గమనించి వెంబడించి చంపివేశాయి. జింక మృతదేహాన్ని చూసిన రైతు సమాచారాన్ని విలేకరులకు తెలియపర్చడంతో వారు ఫారెస్టు అధికారులకు విషయం చేరవేశారు. ఘటన స్థలానికి ఫారెస్టు అధికారులు చేరుకొని పంచనామను నమోదు చేసి, చనిపోయిన జింకను జిల్లా కేంద్రం కార్యాలయానికి తరలించారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం ఖననం చేయనున్నట్లు ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు.

# 'హరితహారం' అగ్నికి ఆహుతి



వెల్టూరు ప్రధాన రోడ్డు వెంట కాలిన మొక్కలు

- ప్రధాన రోడ్ల వెంట నాటిన మొక్కలకు మంటలు
- రైతుల నిర్లక్ష్యానికి నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పంట వ్యర్థాలు కాల్చే సమయంలో ప్రమాదం
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

**చిన్నంబావి:** గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన హరిత హారం పథకం అబాసుపాలవుతోంది. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ప్రతి గ్రామం యొక్క ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. పచ్చదనం పెంచడంలో కీలకంగా ఉండాల్సిన అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ కార్యక్రమం నిర్వీర్యమవుతోంది. నాటిన మొక్కల్లో ఎక్కువ భాగం ఎండిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలోని వెలగొండ నుంచి లక్ష్మీపల్లి స్టేజీ వరకు, మండల కేంద్రం నుంచి కొప్పునూరు, చెల్లపాడు వరకు, పెద్దదగడ నుంచి మియాపూర్ వరకు ఉండే రోడ్డు మార్గాల్లో ఇరువైపులా రూ.లక్షలు ఖర్చు చేసి మొక్కలు నాటడంతో పాటు ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. కానీ వాటికి మంటలు అంటుకుంటుడడంతో మొక్కలు, ట్రీగార్డులు కాలిపోవడంతో రూ.లక్షలు నిధులు వృథా అవడం, ఏపుగా పెరిగి మొక్కలు బూడిద అవుతున్నాయి.

**మండలంలో ఇలా..**

మండలంలోని చెల్లపాడు, అయ్యవారిపల్లి, వెల్టూరు గుండా మండల కేంద్రం వరకు ప్రధాన రహదారి వెంబడి, కొప్పునూరు గ్రామానికి వెళ్లే రహదారి గుండా సైతం మొక్కలను నాటారు. రోడ్డు పక్కల ఉండే పంట పొలాల్లో ఉండే వ్యర్థాలకు రైతులు నిప్పు పెట్టడంతో పాటు వాటిని పూర్తిగా ఆర్పకపోవడంతో ఆ మంటలు హరిత హారం మొక్కలకు అంటుకొని రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఎక్కువ భాగం కాలిపోయాయి. సరైన ప్రణాళికలు లేకుండా మొక్కలు నాటడంతో అవి ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు అడ్డం రావడంతో ట్రాన్స్‌కో అధికారులు కొమ్మలను, చెట్లను నరికి వేస్తున్నారు. పంటపొలాలకు అనుకుని మొక్కలు నాటడంతో రాబోయే రోజుల్లో పెద్దగా పెరిగి పంట పొలాలకు అడ్డంకిగా మారుతుందనే ఉద్దేశంతో రైతులు కొంత మంది నిప్పంటిస్తున్నారు.

**అధికారులు దృష్టి పెడితేనే..**

సర్పంచుల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన రావడంతో వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మొక్కలను కాపాడుకోవల్సిన అవసరం అందరిపై ఉంది.

**అధికారులు చొరవ చూపాలి**



ప్రభుత్వం పచ్చదనాన్ని పెంచాలనే ఉద్దేశంతో రూ.లక్షలు వెచ్చిస్తుంది. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో వారు పంట వ్యర్థాలకు నిప్పు పెడుతుండడంతో అవి హరితహారం మొక్కలకు అంటుకుంటున్నాయి. అధికారులు గ్రామ స్థాయిలో రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– సుధాకర్, గూడెం గ్రామం

**పర్యవేక్షణ చేస్తున్నాం**



గూడెం, కొప్పునూరు, వెల్టూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు వెంట మొక్కలు కాలిపోయాయి. రైతులు పంట చెత్తను అంటించి మంటలను ఆర్పివేయకపోవడంతోనే మొక్కలకు నష్టం జరుగుతుంది. రైతులు కూడా మంటలను ఆర్పి మొక్కలను సంరక్షిస్తే బాగుంటుంది. కాలిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుతున్నాం.

– రమణరావు, ఎంపీడీఓ

## ముసుగు పడింది

సాక్షి ఎఫెక్ట్..

**అమరచింత:** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా అధికారులు ఎన్నికల కోడ్‌ను విధిగా అమలు పరుస్తున్నారు. పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహనికి ఎన్నికల కోడ్‌లో భాగంగా ముసుగు కప్పాల్సిన అధికారులు విషయాన్ని విస్మరించారు. దీంతో గురువారం సాక్షి దినపత్రికలో ఎన్నికల కోడ్ వర్తించదా అన్న శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం స్పందిస్తూ సిబ్బంది ద్వారా రాజీవ్ విగ్రహానికి గురువారం ముసుగు కప్పించారు.



ముసుగు కప్పిన రాజీవ్ విగ్రహం

## కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం



పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

**పాన్‌గల్:** రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు మండలంలో ఇంకా ప్రారంభం కాలేదు. రైతులు వరి కోతలు కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా.. ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాల్లో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి ఇబ్బందులను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

## పెట్రోల్ బంకుల వద్ద అప్రమత్తత అవసరం

**ఆత్మకూర్:** పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు, సిబ్బంది తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, ధూమపానం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పెట్రోల్ బంకుల వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించడంతో పాటు అవగాహన కల్పించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో క్లుప్తంగా వివరించారు. రెండు రోజుల పాటు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, సందీప్ రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## 'గురువే నిజమైన మార్గదర్శకుడు'


**కొత్తకోట రూరల్:** నేటి సమాజానికి నిజమైన మార్గదర్శకుడు గురువే అని పెద్దమందడి మండల విద్యాధికారి జయశంకర్ అన్నారు. మనిగిల్ల జెడ్పీహెచ్‌లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేంద్రనాథ్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేంద్రనాథ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఈఓ జయశంకర్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చి మార్గదర్శిగా నిలిచేది ఒకే ఒక వ్యక్తి ఉపాధ్యాయుడన్నారు. పదవి విరమణ అనంతరం సమాజ సేవలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థులతో కలిసిపోయి పాఠం చెప్పడం వలన సత్ఫలితాలు వస్తాయని, దాన్నే ఆ విద్యార్థి అచరిస్తాడని తెలిపారు. పదవి విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, నిత్యం సమాజంలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించే వారికి కాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, మంజులత, మహానంది, చంద్రశేఖర్, రవికుమార్‌రెడ్డి, శివయ్య, రణధీవ్, జగదీష్, వెంకటేశ్వర్లుగౌడ్, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ, చంద్రకళ, విజయ్‌కుమార్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయుడు సురేంద్రనాథ్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ జయశంకర్, ఉపాధ్యాయ బృందం

## మందు బాబులకు అడ్డాగా 'డబుల్' ఇళ్లు

**పెబ్బేరు రూరల్:** మండల కేంద్రం సమీపంలోని హైవే పక్కన పేదల కోసం డబుల్ బెడ్‌రూంలు నిర్మించారు.ఎన్నికల ముందు అధికారులు లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిచారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇళ్లలోకి వెళ్లలేదు. అక్కడ ఎవరూ లేకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్లను మందు బాబులు బార్లుగా వినియోగిస్తున్నారు. తాగిన తర్వాత మద్యం సీసాలను పగలగొడుతుండడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



పగలగొట్టిన మద్యం సీసాలు

## తాగునీటి సమస్య రానివొద్దు



రామన్‌పాడు ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ నాయకులు

- జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్
- రామన్‌పాడు ప్రాజెక్టు సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**మదనాపురం:** తాగునీటి సమస్యలు రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జూరాల నుంచి రామన్‌పాడుకు నీటి విడుదల చేయించాలని జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల బీఆర్ఎస్ నాయకుల బృందం రామన్‌పాడు ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి నుంచి మంత్రి కృష్ణారావు తన ప్రాంతానికి నీటిని తీసుకెళ్తుంటే ఈ ప్రాంత నాయకులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రస్తుతం నీటి సమస్య గ్రామాల్లో తీవ్రంగా ఉందని, తాగడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన చేపట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ తాగునీటి సమస్య తలెత్తలేదని, ఈ ఏడాది తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కరించకుంటే తమ పార్టీ ప్రజల పక్షాన ఆందోళన చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షుడు చీర్ల శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, నాయకులు ఆణిముని శివ, రాజు, మాసన్నయాదవ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ను నమ్మొద్దు



బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి:** అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మొద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పార్లమెంటు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ బి. లక్ష్మయ్య, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ఆయా కూడళ్లలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఇది వరకు కొనసాగుతున్న రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, 24 గంటల విద్యుత్ సరఫరాల్లోనూ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. కల్యాణ లక్ష్మి పథకంలో నగదు సాయంతో పాటు తులం బంగారం ఇస్తామన్న నేతలు ఇప్పటి వరకు ఎంత మందికి బంగారం ఇచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సూర్యవంశం గిరి, పరంజ్యోతి, బండారు కృష్ణయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి

**పాన్‌గల్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై దాడిచేసిన ఏబీవీపీ విద్యార్థి నాయకులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయాల కోసం నిరంతరం శ్రమిస్తున్న విద్యార్థి సంఘం యూనివర్సిటీల్లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించడాన్ని ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు జీర్ణించుకోవట్లేదని దుయ్యబట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు.

### వంట సామగ్రి చోరీ

**కోడేరు:** మండల కేంద్రంలోని అదర్శ పాఠశాలలో వంట సామగ్రిలు చోరీకి గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఈనెల 16న పాఠశాలలో మధ్యాహ్నం భోజనాలు వడ్డించి సామగ్రిని గదిలో ఉంచారు. 17న సెలవు దినం కావడంతో 18న ఎప్పటిలాగే గదిలోకి వెళ్లి సామగ్రిని చూడగా కనపించలేదు. గతంలో కూడా వంట సామగ్రి ఎత్తుకెళ్లారని నిర్వాహకులు వాపోయారు.

### పరీక్ష ఫీజు చెల్లించండి

**కొల్లాపూర్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు మే 6వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రమేష్‌లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సెమిస్టర్ పరీక్షలు మే 26 వతేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

### ఇన్సూరెన్స్ చెక్ పంపిణీ

**పెద్దకొత్తపల్లి:** మండలంలోని ఇంద్రకల్ గ్రామానికి చెందిన జాఫర్ ఇటీవల మృతిచెందాడు. గతేడాది ఏడాది శ్రీరాంలైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో పాలసీ తీసుకోవడంతో ఈమేరకు గురువారం మృతుడి జులేకాబేగానికి రూ.9.63 లక్షల విలువ గల చెక్‌ను సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ పంపిణీ చేశాడు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజు, కాంగ్రెస్ నాయకులు దండు నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ శ్రీహరి, బ్రాంచ్ మేనేజర్ నరేష్‌కుమార్ రెడ్డి, మహమ్మద్‌హుస్సేన్, బద్దెనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రహరీని ఢీకొన్న వడ్ల లారీ

**అమరచింత:** మండలంలోని మస్తీపురంలో వడ్ల లోడ్‌తో వస్తున్న లారీ అదుపు తప్పి ఇంటి ప్రహరీని ఢీకొన్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని చింతరెడ్డిపల్లి నుంచి రైతులతో కొనుగోలు చేసిన వడ్లను ఆత్మకూర్‌కు తరలించేందుకు వస్తున్న లారీ అదుపు తప్పింది. మస్తీపురం రామేశ్వర్‌రెడ్డి ఇంటికి చెందిన ప్రహరీని వేగంగా ఢీకొట్టడంతో గోడ కూలిపోయింది. ప్రమాద సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.



## ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు



**పెబ్బేరు రూరల్:** వనపర్తి మండలంలోని పెద్దగూడెం కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి బ్రహోత్సవాలు గురువారం ముగిశాయని అర్చకులు వెంకటరమణశర్మ తెలిపారు. గురువారం ఉదయం వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో గుడిలో సీతాసమేతుడు శ్రీరాముడికి చక్రస్నానం చేయించారు. స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు, మాజీ సర్పంచ్ కొండయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మోదీని మూడోసారి ప్రధానిని చేద్దాం

**పెబ్బేరు రూరల్:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా అధికార ప్రతినిధి, బీజేపీ మండల ఇన్‌చార్జి పెద్దిరాజు కోరారు. గురువారం వనపర్తి మండలంలోని చిట్యాలలో భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు గెలిస్తే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలవడం కోసం అబద్ధపు హామీలను ఇస్తుందని, గతంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల ఇప్పటికీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. గతంలో ప్రభుత్వం ఏర్పడిన రోజే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పినా.. ఆ ఊసే ఎత్తట్లేదని మండిపడ్డారు. పెబ్బేరు మండలంలోని రంగాపురంలో బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా మండల బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భగవంతుయాదవ్, రాములు, శ్రీనివాసులు, జంగిడి బాలరాజు, శ్రీనివాసులు, జంగిడి యాదగిరి, భాస్కరావు, రమేష్, ఆంజనేయులు, అనిల్‌కుమార్, వెంకటేష్, మండ్ల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**ఖిల్లాఘనపురం:** రాజ్యాంగం అంటే బీజేపీలోని ప్రతి కార్యకర్తకు ఎంతో గౌరవమని బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ సీతారాములు, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ అన్నారు. గురువారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కొంతమంది ప్రతిపక్ష నాయకులు బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ మూడోసారి గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారంటూ నమ్మశక్యంగాని మాటలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. ఇటీవల రాజస్తాన్‌లో జరిగిన ప్రచార సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ రాజ్యాంగంపై స్పష్టమైన ప్రకటన చేశారన్నారు. మూడోసారి దేశంలో బీజేపీ మిత్రపక్షాలతో కలిసి 400 సీట్లు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న నాయకులు

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన 30 మంది నాయకులు గురువారం వనపర్తిలోని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లెల చిన్నారెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, వెంకట్రాములుయాదవ్, మద్దిలేటి, శ్రీనివాసులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

## తాటిపాములలో బండలాగుడు పోటీలు



బహుమతులను ప్రదానం చేస్తున్న రైతు సంఘం నాయకులు

**పెబ్బేరు రూరల్:** ఎలాంటి బెట్టింగులు లేకుండా రైతుల ఉత్సాహం కోసమే వృషభ రాజముల పోటీలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి ప్రారంభించారు. అనంతరం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు సాయిచరణ్‌రెడ్డి, సతీష్, బీరం రాజశేఖర్‌రెడ్డి, రాజగౌడ్, కురుమన్న, వాసుదేవారెడ్డి, ఆశన్న, వెంకటయ్యానాయుడు, శేఖర్, రంజిత్, శేఖర్ రెడ్డి, ప్రదీప్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.